క్లుప్తంగా

మంగరాయుడికి వెన్న అలంకరణ



ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలసిన మంగరాయుడికి ఆదివారం పుష్యార్క యోగం సందర్భంగా నవనీత (వెన్నతో) అలంకారం చేసినట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు తెలిపారు. పుష్యార్కయోగం సందర్భంగా మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల ఆదేశాల మేరకు స్వామివారికి విశేష మధు అభిషేకం, ఫల పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం నవనీత (వెన్న) అలంకారం చేసినట్లు చెప్పారు. పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధురాలు లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పరమేష్

ఆదోనిరూరల్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని రాందేవ్ ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న లక్ష్మమ్మ అనే వృద్ధురాలికి పెద్దహరివాణం గ్రామ వలంటీర్ పరమేష్ అక్కడికే వెళ్లి పింఛన్ అందజేసి ప్రశంసలు పొందారు. ఈ మేరకు ఆదివారం వలంటీర్ పరమేష్ పెద్దహరివాణం గ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్లి ఆ వృద్ధురాలికి డబ్బులను అందించాడు. దీంతో ఆ వృద్ధురాలు రెండు చేతులు జోడిస్తూ పరమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. తాము ఉన్నచోటుకే వచ్చి పింఛన్ అందించడం సంతోషంగా ఉందని ప్రభుత్వ పాలన, వలంటీర్ సేవలపై హర్షం వ్యక్తం చేశారు.

ఆదోని ఆర్ట్స్ కళాశాల జట్టు జయకేతనం



క్రీడాకారులతో నిర్వాహకులు

ఆదోనిఅర్బన్: రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ కబడ్డీ టోర్నమెంట్‌ను ఈ యేడాది కర్నూలు జిల్లాలోని శ్రీలక్ష్మి బీపీడీ కాలేజీ ఆధ్వర్యంలోని ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహించారు. మొత్తం 23 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో ఆదోని కాలేజీ జట్టు విజేతగా నిలిచిందని కళాశాల యాజమాన్యం బి.దైవాదీనం రెడ్డి, విట్టా సతీష్, ప్రిన్సిపాల్ పి.మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆర్ట్స్ కళాశాల జట్టు కోసిగి నారాయణ డిగ్రీ కాలేజీ మీద ఆరు పాయింట్లతో విజయం సాధించి కప్పు కైవసం చేసుకుందని చెప్పారు. పీడీ డాక్టర్ ఎర్రిస్వామి, అధ్యాపక బృందం క్రీడాకారులను అభినందించారు.

నేడు ఇస్వీలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోనిరూరల్: మండలంలోని ఇస్వీ గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గీతావాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

రేపు స్థూపం ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న స్థూపం

ఆదోనిరూరల్: ఆదోని మండలం ఢణాపురం గ్రామానికి చెందిన నరసింహయ్య కమ్యూనిస్టు నాయకుడిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తూ అమరుడయ్యాడు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా రూ.10 లక్షలతో గ్రామ మాజీ సర్పంచ్ ఈరన్నగౌడ్ స్థూపం నిర్మించారు. ఇందుకుగానూ ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.51 వేలు విరాళం అందించారని ఈరన్నగౌడ్, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు బసాపురం గంగన్న ఆదివారం తెలిపారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ మంగళవారం నరసింహయ్య స్థూపం ప్రారంభోత్సవం ఉంటుందని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

8న డోన్‌లో విద్యుత్ అదాలత్

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 8న డోన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. డోన్ డివిజన్ పరిధిలోని వెల్దుర్తి మండల విద్యుత్ వినియోగదారులు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే అదాలత్‌లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. డోన్ డీఈ కార్యాలయంలో జరిగే ఈ అదాలత్‌కు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వయం ఉపాధికి తోడ్పాటు



పొదుపు గ్రూపు సభ్యుల సమావేశం,



టైలరింగ్ షాపు నడుపుతున్న మహిళ

ఆదోని సెంట్రల్: మహిళలు అర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. బ్యాంకు లింకేజీల ద్వారా పొదుపు మహిళలకు విరివిగా రుణాలిచ్చి స్వయం ఉపాధితో ఉన్నతంగా జీవించేలా బాటలు వేస్తుంది. ఫలితంగా పలువురు మహిళలు తమ జీవనోపాధులను మెరుగుపరచుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

ఆదోని పట్టణంలో 2800 పొదుపు సంఘాల గ్రూపులు ఉన్నాయి. అందులో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి గాను వెయ్యి గ్రూపులకు రూ.40 కోట్లు రుణాలను ఇప్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 215 గ్రూపులకు రూ.19 కోట్ల రుణాలను మంజూరు చేయించారు. మిగతా గ్రూపులకు కూడా రుణాలను మంజూరు చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుండడంతో చాలా మంది వాయిదాలు సక్రమంగా చెల్లిస్తూ వ్యాపార అభివృద్ధి కోసం తిరిగి రుణం తీసుకుంటున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదు. బ్యాంకులో రుణం పొందాలంటే నెలలు, వారాలు పట్టేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రికవరీ బాగా ఉండడంతో మరింత మందికి తోడ్పాటునందించేందుకు బ్యాంకుల వారే రుణ వాయిదాలు అయిపోగానే ఫోన్లు చేసి మరీ రుణాలను మంజూరు చేస్తున్నారు.

రుణాలతో పాటు ప్రభుత్వ తోడ్పాటు

బ్యాంకు రుణాలతో పాటు ప్రభుత్వం కూడా మహిళల అర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారికి జగనన్నతోడు పథకం కింద ప్రతి ఏటా రూ.10 వేలు చెల్లిస్తోంది. చేతి వృత్తులు పని చేసుకొనే వారికి జగనన్న చేయుత పథకం కింద ఏటా రూ.10 వేలు అందిస్తున్నారు. ఇలా ఆసరా, చేయుత, భరోసా వంటి పథకాలతో మహిళలకు తోడ్పాటు నందిస్తున్నారు.

కొంతమంది మహిళలు చీరల వ్యాపారాలు, టైలరింగ్ షాపులు, కిరాణ కొట్టు, టీ హోటల్స్ వంటి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనోపాధులను మెరుగు పరుచుకోవడమే కాకుండా తమ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు.

ఎంతగానో ఉపయోగపడుతుంది



ప్రభుత్వం అందిస్తున్న సహాయం మాకు ఎంతోగానో ఉపయోగపడుతోంది. నా భర్త ఆటో నడుపుతాడు. వచ్చిన దానితోనే జీవనం సాగించేవాళ్లం. పొదుపు సంఘాల గ్రూపు నుండి రూ.50 వేల రుణం తీసుకున్నాం. దీనికితోడు జగనన్న చేదోడు పథకం కింద డబ్బులు వచ్చాయి. వచ్చిన డబ్బులతో టైలరింగ్ షాపు పెట్టుకున్నాను. నా భర్త సంపాదనకు నా ఆదాయం కూడా తోడు కావడంతో కుటుంబాన్ని ఇబ్బంది లేకుండా పోషించకోగలుగుతున్నాం. తీసుకున్న రుణాలకు సున్నా వడ్డీ కుడా వర్తిస్తోంది. ప్రభుత్వం అందించే సహాయం నిరుపేదలైన మాలాంటి వారి జీవితాలను మెరుగుపరచుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. – భాగ్యలక్ష్మి, ఆదోని

రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలి



బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి వాయిదాలు సకాలంలో చెల్లించాలి. అప్పుడే బ్యాంకుల వారు మరింత మందికి రుణాలను అందించడానికి ముందుకు వస్తారు. 2023–2024 అర్థిక సంవత్సరానికి గాను వెయ్యి గ్రూపులకు రూ.40 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంగా పెటుకున్నాం. ఇప్పటివరకు రూ.19 కోట్లు మంజూరు చేయించాం. మిగిలిన గ్రూపులకు కూడా రుణాలను మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాం. పొదుపు గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాల ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకుంటున్నారు. – సమీనా సిటీ మిషన్ మేనేజర్

ముమ్మరంగా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంత్రాలయం నియోజకవర్గంలో 5 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేశారు. అందులో ఒకటైన ఐరన్‌గల్లు లిఫ్ట్ ఇరిగేషన్‌ను రూ.18 కోట్ల వ్యయంతో తుంగభద్ర నది ఒడ్డు నుంచి ఐరన్‌గల్లు గ్రామం వరకు పైప్‌లైన్ వేసి లిఫ్ట్ ద్వారా సాగునీటిని అందించేందుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇదివరకే పైప్‌లైన్ పనులు పూర్తి కాగా నది ఒడ్డున పంప్ హౌస్, ఐరన్‌గల్లు వద్ద స్టోరేజ్ పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయితే దాదాపు 1500 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. వేగవంతంగా పనులు జరుగుతుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఐరన్‌గల్లు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్న దృశ్యం

ఎమ్మెల్యేను కలిసిన టీవీ మెకానిక్‌లు



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ మెకానిక్‌లు

ఆదోనిఅర్బన్: స్కిల్ డెవలప్‌మెంట్ కింద టీవీ మెకానిక్‌లకు శిక్షణ ఇవ్వాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ మెకానిక్ యూనియన్ (ఏఈటీయూ) స్టేట్ ప్రెసిడెంట్ కొండవీటి శ్రీహరి, ఆదోని లోకల్ టీవీ మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్ ఖాదర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి టీవీ ట్రైనింగ్ క్యాంపు కర్నూలులోనే మొదటగా పెట్టాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సీఎంకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఈటీయూ నాయకులు సత్తార్, రఫీ, మధుసూదన్‌రెడ్డి, ఆర్కే రెడ్డి, కన్నయ్య, సంగమేష్, రాజేష్‌స్వామి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఆదోనిఅర్బన్: ఆదోని లయన్స్ క్లబ్, అవోపా మరియు చిన్మయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు ఏషియన్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరానికి విశేష స్పందన లభించిందని లయన్స్ క్లబ్ అధినేత డాక్టర్ వై.గోపీనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆదోనిలోని చిన్మయి మిషన్‌లో రక్తనాళాల చికిత్సకు సంబంధించిన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో రూ.4500 విలువైన రక్త పరీక్షలను ఉచితంగా చేసినట్లు నిర్వాహకులు లయన్స్ క్లబ్ అధినేత డాక్టర్ వై.గోపీనాథ్ తెలిపారు. శిబిరంలో దాదాపు 350 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆదోని చిన్మయి మిషన్ కార్యదర్శి మెదేహాల్ రఘునాథ్, అవోపా ఉపాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, ఏషియన్ ఆస్పత్రి వైద్యులు, లయన్స్ క్లబ్ నేతలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాంతిరాం ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం బార్‌పేట పోస్టాఫీసు వద్ద ఉర్దూ ఘర్ నందు చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, ఎన్ఆర్ఐ నగేష్ కాకుబాళ్ తెలిపారు. మొత్తం 300 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఇందులో 83 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి నంద్యాల శాంతిరాం ఆస్పత్రికి తరలించామని, డాక్టర్ల సలహా మేరకు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు చెప్పారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం నాయకులు రాయచోటి సుధాకర్, వంకదారు శ్రీనాథ్‌గుప్తా, బద్రి, శ్రీధర్, విశ్వనాథ్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మహాజన సోషలిస్ట్ పార్టీ ఏపీ అధ్యక్షుడు కె.విశ్వనాథ్

కోసిగి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభలను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ఏపీ అధ్యక్షుడు కె.విశ్వనాథ్, జిల్లా కోకన్వీనర్ దుర్గప్ప, ఎంఆర్‌పీఎస్ జిల్లా కో–కన్వీనర్ రెడ్డి పోగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం కోసిగిలో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఎస్సీ కాలనీలో కర పత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11న హైదరాబాద్‌లో నిర్వహించే సభలో ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నట్లు తెలిపారు. మాదిగ, ఉప కులాల వారు అత్యధిక సంఖ్యలో హాజరై తమ హక్కును సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు నాగరాజు, ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ సామేల్, వందగల్లు నరసింహులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి సైన్స్ ప్రాజెక్టు ఎంపిక



విద్యార్థినులు ప్రియదర్శిని, మానసకు మొమెంటో, ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఈఓ రంగారెడ్డి

వెల్దుర్తి (కృష్ణగిరి): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ–నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్) నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శలో వెల్దుర్తి కేజీబీవీ 10వ తరగతి విద్యార్థిని ప్రియదర్శిని రూపొందించిన నమూనా ప్రాజెక్ట్ మొదటి స్థానంలో నిలవడంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కేజీబీవీ ఎస్‌ఓ షాకీరా బేగం ఆదివారం తెలిపారు. ప్రియదర్శిని ప్రదర్శించిన ద సిగినిఫికేషన్ ఆఫ్ మిల్లెట్స్ ఇన్ ద మాడ్రన్ వరల్డ్ (ఆధునిక ప్రపంచంలో చిరుధాన్యాల ప్రాధాన్యత) ప్రాజెక్టు ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ప్రియదర్శినితోపాటు తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మానస సైతం మరో ప్రాజెక్టును ప్రదర్శించి మెప్పు పొందిందన్నారు. శనివారం కర్నూలు మాంటిస్సోరి స్కూల్‌లో ఎన్‌సీఎస్‌సీ కో–ఆర్డినేటర్ రంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో జిల్లాస్థాయి విజేత ప్రియదర్శిని, పాల్గొన్న మానసకు డీఈఓ రంగారెడ్డి చేతుల మీదుగా మొమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, పూల సేవ, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్రాకు చెందిన భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

తెల్ల దోమతో ఇబ్బందులు

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో వర్షాభావ పరిస్థితుల వల్ల తెల్లదోమ పెరగడం వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లదోమ విపరీతంగా పెరిగి కళ్లలో పడుతుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక బయటికి వస్తే చాలు తెల్లదోమ కళ్లలో పడుతుందన్నారు. ఎక్కడ కూర్చున్నా కళ్ల ముందే తెల్లగా దోమలు వస్తుండడంతో ఏమవుతుందోనని భయపడిపోతున్నారు. పంచాయతీ అధికారులు తెల్లదోమ నివారణకు మందులు స్ప్రే చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోండి



కంబలదిన్ని గ్రామంలో సూచనలు చేస్తున్న ఆర్ఓ రమ

పెద్దకడబూరు: మండలంలోని అర్హులైన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్ఓ రమ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కంబలదిన్ని, కంబదహాల్, జాలవాడి, హెచ్.మురవణి గ్రామాలలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు క్యాంప్‌ను ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అనివార్య కారణాల వల్ల ఎవరిదైనా ఓటు హక్కు జాబితా నుంచి తొలగిపోయినట్లయితే వారు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు వారి పరిధిలోని పోలింగ్ బూత్‌లలో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ఆర్ఐ మహేష్, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

20న హిందూ సమ్మేళనం



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఆదివారం ఆదోని మండల స్థాయి హిందూ సమ్మేళనం నిర్వహణపై సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయకులు, పెద్దలు సమావేశమయ్యారు. ఈనెల 20వ తేదీన రెడ్డీస్ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆదోని ఆర్ఎస్ఎస్ నగర సంఘచాలక్ శ్రీమంతా బుగ్గా రమేష్, ఎస్ఎస్ఎఫ్ మండల సంయోజక్ భీమలింగారెడ్డి తెలిపారు. సనాతన హిందూ ధర్మాన్ని ఎందరో ఋషులు, మహాపురుషులు జాగరణ చేస్తూనే ఉన్నారన్నారు. వారి మార్గదర్శకత్వంలో మనమంతా హిందువులం, ధర్మ గంగా బిందువులం అంటూ హిందువుల చైతన్యం (జాగరణ) చేయడం కోసం సమరసతా సేవా ఫౌండేషన్ ఆదోని మండల కమిటీ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. సమ్మేళనంకు ఆదోని మండలంలోని టీటీడీ సేవకులు, వినాయక మండపాల నిర్వాహకులు, భజన బృందాలు, అయ్యప్ప శివ, భవానీ మాతా దీక్షా స్వాములు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

12న మస్జీదే ఖాదిర్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మజీదె-ఎ-ఖాదిర్



ఖాదర్ లింగస్వామి దర్గా

• హాజరు కానున్న అజ్మీర్ దర్గా పీఠాధిపతి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా తదితరులు

కౌతాళం: మండల కేంద్రంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ఆవరణలో సువిశాలమైన ప్రదేశంలో నిర్మించిన మస్జీదే ఖాదిర్‌ను ఈనెల 12న ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి దేశం నలుమూలల నుంచి వివిధ దర్గాల పీఠాధిపతులతో పాటు ప్రముఖ రాజకీయ నాయకులు హాజరవుతున్నట్లు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా హుసేని చిష్తీ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం దర్గా ఆవరణలో మసీదు నిర్మించాలని దర్గా పదవ పీఠాధిపతి, తమ తండ్రి సయ్యద్ సాహెబ్ పీర్ హుసేని చిష్తీ ఆకాంక్ష అని ఈ నిర్మాణానికి మూడు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించగా ప్రస్తుతం పూర్తయినట్లు తెలిపారు. మసీదు ప్రారంభోత్సవానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కర్ణాటక రాష్ట్రం మైనార్టీ, వక్ఫ్ బోర్డు మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్, స్పీకర్ యు.టీ. ఖాదర్ సాబ్‌లతోపాటు కర్నూల్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మంత్రాలయం, ఆదోని ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు.

పీఠాధిపతులు హాజరు

కార్యక్రమానికి దేశంలో వివిధ దర్గాల పీఠాధిపతులు హాజరవుతారని తెలిపారు. అజ్మీర్ ఖాజా గరీబ్ దర్గా ప్రధాన పీఠాధిపతి సయ్యద్ నసురుద్దీన్ చిష్తీ, గుల్బార్గ్ బందెనవాజ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ గౌసుధరజ్ ఖుస్రు హుసేని చిష్తీ, గుల్బార్గా చిన్న దర్గా పీఠాధిపతి సయ్యద్ షా హసన్ షబ్బీర్ హుసేని, హైదరాబాద్ నాంపల్లిలోని షా ఖాముష్ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా హనీఅక్బర్ నిజాముద్దీన్ హుసేని సాబిరి, బీదర్‌లోని అబుల్ ఫయ్యాజ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అసదుల్లా హుసేనితో పాటు వివిధ దర్గాల పీఠాధిపతులు హాజరవుతారని ఆయన తెలిపారు.

కార్యక్రమాలు

మసీదును ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభిస్తామన్నారు. మసీద్‌లో మొదటిసారిగా 4.45 అసర్ నమాజ్‌ను చేస్తామన్నారు. అనంతరం దర్గాకు ఉత్తర భాగంలో నిర్మించిన ఉత్తర ద్వారంను ప్రముఖులచే ప్రారంభిస్తామని తెలిపారు. అంతకు ముందు తెల్లవారుజామున ఖురాన్ పారాయణం ఉంటుందని అనంతరం దరుదెషరీఫ్ చదవడం దానితో పాటు నాతేషరీఫ్‌లు ఉంటాయన్నారు.

మదర్సా ఏర్పాటుకు శ్రీకారం

మసీద్ ప్రారంభోత్సవం రోజే మదర్స్–ఏ–సానీ–ఖాదిర్ లింగ్‌బంద్ (సయ్యద్ సాహెబ్‌పీర్ హుసేని చిష్తీ) తన తండ్రి దర్గా 10వ పీఠాధిపతి క్రీస్తుశేషులు సయ్యద్ సాహెబ్‌పీర్ హుసేని చిష్తీ పేరిట మదర్సాను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మదర్సా ద్వారా పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తామన్నారు. ఈ ఏడాది నుంచే ప్రారంభం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ జామియా–నిజామియా వారి మదర్సా ద్వారా ఇక్కడ శాఖను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ అలంకరణలో దర్గా

మసీదు, ఉత్తర ద్వారం ప్రారంభోత్సం సందర్భంగా దర్గాను విద్యుత్‌దీపాల అలంకరణతో ముస్తాబు చేశారు. ముఖ ద్వారంతో పాటు మజీద్‌పై 60 అడుగుల ఎత్తులో నిర్మించిన మినార్‌లకు విద్యుత్ దీపాలను సుందరంగా అలంకరించారు. కార్యక్రమానికి కౌతాళంతో అన్ని గ్రామాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

కుర్లేహాళ్లిలో రీసర్వే పూర్తి



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున

హాలహర్వి: మండలంలోని కుర్లేహళ్లి గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కార్యక్రమం ద్వారా చేపట్టిన భూముల సమగ్ర సర్వే పూర్తయ్యిందని తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. రీసర్వే ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాగిందన్నారు. ఆధునిక పద్ధతిలో డిజిటల్ రెవెన్యూ రికార్డులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. వీటిని పూర్తి చేసి భూయజమానులకు హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సర్వే చేపట్టడం జరిగిందన్నారు. సర్వే పూర్తయ్యాక భూహక్కు పత్రాలను యజమానులకు అందించడంతో పాటు క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు గ్రామాల్లోనే జరిగేలా కొత్త మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, వీఆర్వో ఆంజనేయులు, ఎంపీటీసీ ప్రభాకర్‌గౌడ్, సర్వేయర్లు రోజా తదితరులు పాల్గొన్నారు.